ఈనాడు ఒడిశా

శుక్రవారం సెప్టెంబరు 27, 2024 | 7

మహానది వివాదానికి తెరపడుతుంది: పాటిల్



మోహన్‌తో కరచాలనం చేస్తున్న పాటిల్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌ల మధ్య దీర్ఘకాలంగా నలుగుతున్న మహానది జల వివాదం కొద్ది రోజుల్లో పరిష్కారం అవుతుందని కేంద్ర జలశక్తిశాఖ మంత్రి సి.ఆర్.పాటిల్ చెప్పారు. గురువారం భువనేశ్వర్ వచ్చిన పాటిల్ విలేకరులతో మాట్లాడుతూ... మహానది జల వివాదం తేల్చడానికి కేంద్రం ఏర్పాటు చేసిన ట్రైబ్యునల్ అధ్యయనం ముగిసిందని, త్వరలో తీర్పు చెప్పనుందన్నారు. అనంతరం ఆన లోక్‌సేవాభవన్‌లో ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝిని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పూరీ జిల్లాలోని సువాండోలో జరిగిన మరో కార్యక్రమంలో పాల్గొన్నారు.

కోణార్క్‌లో భారీ వర్షం: సందర్శకుల పాట్లు



నిలిచిన వాన నీటిలో సందర్శకులు

గోపాలపూర్, న్యూస్‌టుడే: విశ్వవిఖ్యాత కోణార్క్ సూర్యనారాయణ స్వామి ఆలయం ఆవరణ గురువారం వర్షం నీటితో నిండిపోయింది. భారీ వర్షం కురవడంతో లోపల నీరు నిలిచిపోయింది. పర్యాటకులు ఇబ్బందులు పడ్డారు. నిలిచిన నీరు బయటకు పోయేందుకు సౌకర్యం లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఈ నిర్మాణం బాధ్యత పర్యవేక్షిస్తున్న పురావస్తుశాఖ (ఏఎస్ఐ) అధికారులు పంపుసెట్లు పెట్టి నీరు తోడించారు. పూరీ జిల్లా అంతటా భారీ వర్షాలు కురవడంతో పాలనాధికారి సిద్ధార్థ్ శంకర్ స్వయిన్ విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు.

మహిళలు, బాలికల రక్షణ కోసం ఎన్ని చట్టాలు అమలు చేసినా వారిపై అఘాయిత్యాలు ఆగడం లేదు. మానవ మృగాల చేతిలో నలిగి వారి బతుకులు ఛిద్రమవుతున్నాయి. రాష్ట్రంలో ఉక్కు నగరంగా పేరొందిన రవుర్కెలాలో మహిళా భద్రత రోజురోజుకూ ప్రశ్నార్థకంగా మారుతోంది. వరుస అత్యాచార ఘటనలతో ఆడపిల్లల తల్లిదండ్రులు బెంబేలెత్తిపోతున్నారు. వారం రోజుల వ్యవధిలో మూడు అత్యాచార కేసులు నమోదు కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.



ఇద్దరు బాలికలపై అత్యాచారం కేసులో పోలీసుల అదుపులో ఓ నిందితుడు

ఉక్కు నగరం ఉలికిపాటు

రవుర్కెలాలో బెంబేలెత్తిస్తోన్న అత్యాచార ఘటనలు

వారం రోజుల వ్యవధిలో మూడు కేసులు నమోదు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే

ఈ నెల 21న రవుర్కెలాలోని గురుద్వార రహదారిలో ఉన్న ఓ పాఠశాల విద్యార్థినిని వ్యాయామ ఉపాధ్యాయుడు శారీరకంగా వేధించిన ఘటన చోటుచేసుకుంది. 22న ఝార్ఖండ్‌కు చెందిన 14, 15 ఏళ్ల ఇద్దరు బాలికలు చెప్పులు కొనుక్కునేందుకు రవుర్కెలా పాత బస్టాండ్ సమీపాన వేచి ఉన్నారు. నిందితులు వారికి మాయమాటలు చెప్పి ఆటోలో ఎక్కించుకొని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ కేసుకు సంబంధించి పట్టుబడ్డ ముగ్గురు నిందితులు 20 ఏళ్లలోపు యువకులు కావడం గమనార్హం. తాజాగా బుధవారం (25న) ఆర్.ఎన్.పలి పోలీస్‌స్టేషన్ పరిధిలో మరో అత్యాచార ఘటన వెలుగుచూసిన విషయం తెలిసిందే. సివిల్ టౌన్‌షిప్‌లోని ఓ రెస్టారెంట్‌కు తన ఇద్దరు స్నేహితులతో కలిసి వెళ్లిన బాలికపై నిందితులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. అనంతరం బాధిత బాలికను రహదారి పక్కన నిందితులు వదిలేసి వెళ్లి పోగా, మరో ఇద్దరు యువకులు ఆమెను ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లి అత్యాచారానికి ఒడిగట్టారు.



రెస్టారెంటుకు వెళ్లిన బాలికపై అత్యాచారం కేసులో నేరం జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రీయ బృందం

నాలుగు బృందాలతో గాలింపు

ఈ విషయమై రవుర్కెలా ఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తున్న డీఐజీ బ్రిజేష్ కుమార్ రాయ్ మాట్లాడుతూ... రెస్టారెంట్‌లో జరిగిన అత్యాచార ఘటనకు సంబంధించి దర్యాప్తు ముమ్మరం చేశామన్నారు. అదనపు ఎస్పీ నేతృత్వంలో వేర్వేరుగా నాలుగు పోలీసు బృందాలు నిందితుల కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్న బ్రిజేష్ దర్యాప్తులో భాగంగా శాస్త్రీయ బృందం ఘటనా స్థలాల్లో ఆధారాలు సేకరించినట్లు వెల్లడించారు. బాధితురాలి వాంగ్మూలం రికార్డు చేశామని, ఆమెకు సత్వర న్యాయం దక్కేలా పోలీసు సిబ్బంది శ్రమిస్తున్నారన్నారు. ఇద్దరు మైనర్ బాలికలపై అత్యాచార కేసులకు సంబంధించి నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు వారు నేరం ఎలా చేశారో వారితోనే చెప్పించారు.

ఆ భూభాగం ఒడిశాదే.!



ఇసుక ర్యాంప్ ప్రాంతంలో ఇరు రాష్ట్రాల అధికారుల సర్వే

కాశీనగర్, న్యూస్‌టుడే: కాశీనగర్ సరిహద్దు బూదర సమీపంలో ఉన్న ఇసుక ర్యాంప్‌పై ఆంధ్రా, ఒడిశా మధ్య సాగుతున్న వివాదం కొలిక్కి వచ్చింది. మూడు నెలలుగా ఇరు రాష్ట్రాల మధ్య నలుగుతున్న ఈ వివాదంపై అధికారులు సంయుక్తంగా బుధవారం సర్వే చేపట్టారు. వీటిపై గతంలో టెండర్ల ప్రక్రియ రెవెన్యూ అధికారుల ఆధీనంలో జరిగేది. ప్రస్తుతం గనుల శాఖ పర్యవేక్షిస్తోంది. ఇటీవల ఆంధ్రా అధికారుల చర్యలతో రాష్ట్ర ఆదాయానికి గండిపడుతుండడంతో సర్వే వేగవంతం చేశారు. మ్యాపులు పరిశీలించి, కొలతలు వేశారు. ఆంధ్ర అధికారుల వద్ద సంబంధిత పత్రాలు లేకపోవడంతో ఆ భూభాగం ఒడిశాకు చెందినదిగా నిర్ధారించారు. గజపతి జిల్లా అదనపు పాలనాధికారి రాజేంద్ర మింజ్, శ్రీకాకుళం జిల్లా పాలకొండ అదనపు కలెక్టర్ జస్వంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో వివాదం తలెత్తకుండా కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించామన్నారు. సర్వేలో బీడీఓ, తహసీల్దార్ బండురధర్ మల్లిక్, ఐఐసీ సునీల్ బెహరా, రెవెన్యూ సూపర్‌వైజర్ ఆనంద ప్రధాన్ తదితరులు పాల్గొన్నారు.

ఉరకలెత్తిన ఉత్సాహం



విద్యార్థినుల నృత్యం

రాయగడ, న్యూస్‌టుడే: ఒడిశా ఆదర్శ విద్యాలయ సంఘటన్ పదో వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గురువారం వివిధ పోటీలు నిర్వహించారు. బిజు పట్నాయక్ సభామందిరంలో జరిగిన ఈ పోటీల్లో గెలుపే ధ్యేయంగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రదర్శనలు ఇచ్చారు. సంప్రదాయ, జానపద నృత్య పోటీలు, వ్యాసరచన, వక్తృత్వం పోటీల్లో వివిధ పాఠశాలల నుంచి సుమారు 700 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి బసంత్ కుమార్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. నోడల్ ప్రిన్సిపల్ మురారి ప్రసాద్ సాహు పాల్గొన్నారు.

అందాల హరివిల్లు కళింగ


అందాల హరివిల్లు కళింగ... ప్రకృతి రమణీయతకు నిలువుటద్దం. నేత్రపర్వం చేసే విశాల తీరం, అటవీ సంపద, చారిత్రక కట్టడాలకు నిలయం. ఈ మనోహర దృశ్యాలు తిలకించడానికి ప్రకృతి ప్రేమికులు ఏటా లక్షలాదిగా తరలి వస్తుంటారు. శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ఉత్సవాలు చేపడుతోంది.
-న్యూస్‌టుడే, గోపాలపూర్

నేత్రపర్వం చేస్తున్న సోయగాలు

నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం



చిలికా సరస్సు



రాష్ట్రంలో 30 పర్యాటక కేంద్రాలను ప్రభుత్వం గుర్తించింది. సౌకర్యాలు కల్పించి సందర్శకులను ఆకర్షించేలా ఏర్పాట్లు చేస్తోంది. భువనేశ్వర్, పూరీ, కోణార్క్‌లను ముక్కోణ పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దింది. ఆసియా ఖండంలో అతిపెద్ద ఉప్పునీటి సరస్సు చిలికా జీవ సంపదకు నిలయం. ఏటా శీతాకాలంలో లక్షలాది విదేశీ విహంగాలు ఇక్కడికి వస్తాయి. సందర్శకులను ఆనందంలో ముంచెత్తుతాయి. చిలికా పరిధిలోని సతపడలో డాల్ఫిన్లు సందడి చేస్తుంటాయి. తూర్పు తీరంలో పూరీ తరువాత గోపాల్‌పూర్‌కి పర్యాటక రంగంలో గుర్తింపు ఉంది. దీనికి ప్రశాంత తీరంగా చెబుతారు. సతకోషియా సిమిలిపాల్ పులుల అభయారణ్యాలు, భితర్ కనికా మొసళ్ల కేంద్రం రాష్ట్రానికి ప్రకృతి ప్రసాదించిన విలువైన సంపదలు. ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకునే ప్రదేశాలు.

పారిశ్రామిక హోదా


ప్రభుత్వం గతంలో పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించింది. ప్రైవేటు పెట్టుబడులతో ఈ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించి, శింగారాలు సమకూర్చాలని ధ్యేయంగా పెట్టుకుంది. దీంతో ఆయాచోట్ల నక్షత్ర హోటళ్లు వెలిశాయి. ఈ ఏడాది బడ్జెట్‌లో కేటాయింపులు పెరిగాయి. 2024-25లో రూ.2,043 కోట్లు ప్రకటించారు.

కొవిడ్ వల్ల ఇబ్బందులు

కొవిడ్ వల్ల ఈ రంగానికి రెండేళ్లు గ్రహణం పట్టింది. 2023లో ప్రభుత్వం దేశ, విదేశాల్లో విస్తృత ప్రచారం చేయించింది. అన్నిచోట్లా సంబరాలు చేపట్టింది ఈ నేపథ్యంలో 2023లో రాష్ట్రానికి 22 వేల మంది విదేశీయులు రాగా, 80 లక్షల మంది భారతీయులు వచ్చినట్లు ఇటీవల శాసనసభలో ఉపముఖ్యమంత్రి ప్రభాతి పరిడ ప్రకటించారు.

అన్ని కేంద్రాలకు పూర్వవైభవం

పర్యాటక శాఖ బాధ్యతలు పర్యవేక్షిస్తున్న ఉపముఖ్యమంత్రి **ప్రభాతిపరిడ** గురువారం పూరీలో విలేకరులతో మాట్లాడుతూ... ఈ కేంద్రాలతోపాటు సాంస్కృతిక వైభవానికి అద్దం పట్టే పీఠాలకూ రాకపోకలు, ఇతర సౌకర్యాలు కల్పిస్తామన్నారు. కాసుల పంట పండిస్తున్న ఈ రంగానికి జవసత్వాలు కల్పించి యువతీయువకులకు ఉపాధికి బాటలు వేయడానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. ఈ ఏడాది శీతాకాలంలో తీర ప్రాంతాల్లో సంబరాలు, అన్ని జిల్లా కేంద్రాల్లో సాంస్కృతిక వేడుకలు నిర్వహిస్తామన్నారు. పర్యాటక రంగాన్ని ఆకర్షించడానికి విస్తృత చర్యలు చేపడుతున్నామన్నారు.



చారిత్రకమైన ఉదయగిరి గుహలు

విశ్వవిఖ్యాత శిల్పకళారామం కోణార్క్ సూర్యనారాయణ మూర్తి ఆలయం





బితర్‌కనికాలో మొసలి



చిలికా సరస్సుపై విదేశీ విహంగాలు

ఉత్తర కోస్తా, తీర జిల్లాల్లో వర్షాలు

సువర్ణరేఖలో పెరుగుతున్న ప్రవాహం



కులాడిహి ఆనకట్ట నుంచి విడుదలవుతున్న వరదనీరు

గోపాలపూర్, న్యూస్‌టుడే: కాలవైశాఖి (థండర్ స్టార్మ్) ప్రభావంతో గురువారం ఉత్తర కోస్తా తీర జిల్లాల్లో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసినట్లు గోపాల్‌పూర్ వాతావరణ అధ్యయన కేంద్రం (ఐఎండీ) అధికారి కె.ఎస్.మూర్తి 'న్యూస్‌టుడే'కు చెప్పారు. శుక్రవారం ఉదయం 8.30 గంటల వరకు ప్రభావం ఉంటుందన్నారు.

వర్షపాతం వివరాలు

కేంద్రం	వర్షపాతం (మి.మీ.లలో)
తాల్చేరు (అనుగుల్)	155
బలికుద (జగత్సింగ్‌పూర్)	105
అలిపింగళ (జగత్సింగ్‌పూర్)	102.4
జగత్సింగ్‌పూర్	99.1
ఉదలా (మయూర్‌భంజ్)	94
కప్తిపద (మయూర్‌భంజ్)	92
గోప్ (పూరీ)	91
కోణార్క్ (పూరీ)	90
కేంఝర్	89
కంకడహడ (ఢెంకనాల్)	84.4
మహకాల్పడ (కేంద్రపడ)	80
బెతనటి (మయూర్‌భంజ్)	67
నకోటి దెవులో (సంబల్‌పూర్)	66
జెనాపూర్ (జాజ్‌పూర్)	64.8

గట్టి నిఘా...

ఉత్తరకోస్తాలో మళ్లీ వర్షాలు కురుస్తున్నందున బాలేశ్వర్ జిల్లా జలేశ్వర్ వద్ద కులాడిహి ఆనకట్ట గేట్లు తెరిచారు. 2200 క్యూసెక్కులు నీరు విడుదల చేయడంతో సువర్ణరేఖ నది ప్రవాహం పెరిగింది. ఇక్కడ నది ప్రమాదస్థాయి 94.5 అడుగులు కాగా ప్రవాహం 101.25 అడుగులకు పెరిగింది. జలవనరులశాఖ పరిస్థితిపై గట్టి నిఘా ఉంచింది.

పాలన, పార్టీ కార్యకర్తలు కీలకం

భాజపా శ్రేణులకు నడ్డా ఉద్బోధ



అంబేడ్కర్ విగ్రహానికి అంజలి ఘటిస్తున్న నడ్డా



విమానాశ్రయంలో నడ్డాకు స్వాగతిస్తున్న ముఖ్యమంత్రి మోహన్



సభ్యత్వాలు నమోదు చేయిస్తున్న పూరీ ఎంపీ సంబిత్ పాత్ర

భువనేశ్వర్, న్యూస్‌టుడే: పాలన, పార్టీ కార్యకర్తలు భాజపాకు మూడు నేత్రాలు అని, విశ్వసనీయతతో పనులు చేయాలని ఆ పార్టీ కేంద్రశాఖ అధ్యక్షుడు జె.పి.నడ్డా చెప్పారు. గురువారం మధ్యాహ్నం భువనేశ్వర్ భాజపా కార్యాలయంలో జరిగిన కార్యవర్గ ప్రతినిధుల సమావేశంలో పాల్గొన్నారు. ఎన్నికల్లో ప్రజలు పార్టీని గెలిపించిన నేపథ్యంలో వారి నమ్మకం వమ్ము చేయరాదన్నారు. డబుల్ ఇంజిన్ పాలనలో రాష్ట్ర ప్రగతి తథ్యమన్నారు. కోటి సభ్యత్వాల నమోదు ధ్యేయం నెరవేర్చడానికి నేతలు, కార్యకర్తలు, చిత్తశుద్ధి చూపాలన్నారు. ఇంతవరకు 25 లక్షల సభ్యత్వాల నమోదు జరగడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి, ఉపముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్, కేంద్ర భాజపా అగ్రనేతలు సునీల్ బన్సల్, దుష్యంత గౌతం, కొంత మంది ఎంపీలు, మంత్రులు, శాసనసభ్యులు పాల్గొన్నారు. 12 గంటలకు వచ్చిన నడ్డాకు విమానాశ్రయంలో అగ్రనేతలంతా స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఏజీ కూడలి వద్దకొచ్చిన నడ్డా బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద అంజలి ఘటించారు. భువనేశ్వర్ నగర ప్రముఖుల సమావేశంలోనూ పాల్గొన్న నడ్డా 4 గంటలకు దిల్లీ ప్రయాణమయ్యారు.

నడి సంద్రంలో రెండు పడవలు



పరదీప్ సముద్రంలో చిక్కుకున్న పడవల వద్ద కోస్ట్‌గార్డ్ బోట్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: ప్రతికూల వాతావరణంలో సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుల పడవ గురువారం యాంత్రికలోపంతో నిలిచిపోయింది. పరదీప్‌లో ఈ ఘటన జరిగింది. పడవలో ఉన్నవారిని ఒడ్డుకు తేవడానికి చేరువలో ఉన్న మరో పడవను అక్కడికి తీసుకెళ్లి తాళ్లు కట్టి ఒడ్డుకు చేర్చే ప్రయత్నం చేశారు. ఇంతలో ఆ పడవ కూడా మొరాయించింది. దీంతో 14 మంది మత్స్యకారులు సంద్రంపై చిక్కుకోగా, ఈ వైనం తెలిసిన కోస్ట్‌గార్డ్ యంత్రాంగం పెట్రోలింగ్ బోటును అక్కడికి పంపించింది. అందులోని సిబ్బంది అందర్నీ కాపాడి ఒడ్డుకు చేర్చారు. సముద్రంపై కెరటాల ఉద్ధృతి ఎక్కువగా ఉండడంతో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సుమారు 80 పడవలు పరదీప్ ఓడరేవుకు చేరువగా వచ్చిన తర్వాత లంగర్లు వేసి ఉంచారు. ఓడరేవు అధికారుల అనుమతి లేకుండా వీరు లంగర్లు వేశారు.

శ్రీక్షేత్రానికి ఫుడ్ ఇన్‌స్పెక్టర్: హరిచందన్



గోపాలపూర్, న్యూస్‌టుడే: విశ్వప్రసిద్ధ పూరీ శ్రీక్షేత్రానికి పూర్తిస్థాయి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నియామకం కానున్నారు. న్యాయశాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్ గురువారం పూరీలో విలేకరులతో మాట్లాడుతూ.... జగన్నాథునికి మహాప్రసాదం (ఒబడా), మరో 56 రకాల పిండివంటకాలు అర్పణవుతాయని, వీటి నాణ్యతపై భక్తుల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, పరిశీలనకు అధికారిని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. శ్రీక్షేత్రంలో సంస్కరణలకు ప్రాధాన్యమిస్తున్నామని, ఈ క్రమంలో త్వరలో మరిన్ని నిర్ణయాలు తీసుకోనున్నామన్నారు. ప్రస్తుతం జగన్నాథ దర్శనానికి నాలుగు ద్వారాల మీదుగా భక్తుల రాకపోకలు జరుగుతున్నాయి. వీటి పరిధిలో బ్యారికేడింగ్ పనులు జరుగుతున్నాయని, ఆలయ ప్రవేశం మరింత సులువవుతుందని చెప్పారు. గర్భగుడిలో రద్దీ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.



పడవలపైనే రాకపోకలు

వదలని వాన.. ప్రజల వేదన

ముంపులో గ్రామాలు

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: పశ్చిమ మిడ్నాపూర్ జిల్లాను వర్షాలు వీడలేదు. ఫలితంగా వరదలు సంభవించి పలు ప్రాంతాలు ముంపులోనే ఉన్నాయి. కంసావతి, శీలావతి, జుమీ నదుల్లో నీరు పెరగడంతో పోటెత్తుతున్నాయి. దీంతో జనజీవనం స్తంభించింది. పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు మూతపడ్డాయి. బాధితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. జిల్లా యంత్రాంగం అన్ని సౌకర్యాలు అందజేస్తోంది. ఝార్‌గ్రామ్ జిల్లాలోని డులుంగ్ నదిలో వరద నీరు చేరి ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. వంతెన పైనుంచి నీరు ప్రవహించడంతో ఝార్‌గ్రామ్, జాంబోని పట్టణాల మధ్య బుధవారం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి.



బాధితులకు చేరవేస్తున్న నిత్యావసరాలు

విద్యార్థి దశ కీలకం



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న శాలినీ, పరుల్

రాయగడ, న్యూస్‌టుడే: విద్యార్థి దశ అత్యంత కీలకమైనదని, స్కూల్ అండ్ మాస్ ఎడ్యుకేషన్ కమిషనర్, కార్యదర్శి శాలినీ పండిట్ అన్నారు. జిల్లాలో రెండు రోజుల పర్యటనకు వచ్చిన ఆమె బుధవారం తడమలో ఒడిశా ఆదర్శ విద్యాలయ సందర్శించారు. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు అందుతున్నాయా లేదా ఆరా తీశారు. వంటశాల పరిశీలించి నాణ్యమైన భోజనం అందజేయాలన్నారు. బాలికల వసతి గృహం వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలసి భోజనం చేశారు. రాత్రి జిల్లా పరిషత్ సమావేశభవనంలో జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు.

పద్మపురం సమితిలో..

గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడజిల్లా పద్మపురం సమితి డేరిగాం పంచాయతీలో కార్యదర్శి శాలినీ పండిత్ బుధవారం సాయంత్రం పర్యటించారు. ఆమెకు మహిళలు ఘన స్వాగతం పలికారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో మాట్లాడారు. విద్యాలయం పరిస్థితి సమీక్షించారు. ఆసుపత్రిలో వైద్య సేవలు గురించి ఆరా తీశారు.

రైతులను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: రైతులు అధికోత్పత్తి వచ్చే పంటలను సాగు చేయాలని ఎమ్మెల్యే రామచంద్ర కడం అన్నారు. సిమిలిగుడకు చెందిన వ్యవసాయ విభాగం, ధన్ ఫౌండేషన్, ఫౌండేషన్ ఫర్ ఎకలాజికల్ సెక్యూరిటీ, సెంటర్ ఫర్ యూత్ సోషల్ డెవలప్‌మెంట్, లోక్ వికాస్ మంచ్ సంయుక్తంగా గురువారం కృషక్ మేళా నిర్వహించాయి. ఎమ్మెల్యే కార్యక్రమాన్ని ప్రారంభించారు. వ్యవసాయానికి అనుకూలమైన ప్రాంతం కావడంతో ఇక్కడ అనేకమంది రైతులు వ్యవసాయంలో రాణిస్తున్నారని, వారిని అధికారులు ప్రోత్సహించాలని కోరారు. సమితి అధ్యక్షురాలు లిల్లీ అంత బిరియా, సమితి అభివృద్ధి అధికారి దేవాశిష గౌడ, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. ఆహార ఉత్పత్తులు, చిరుధాన్యాలతో చేసిన వంటకాలు, వ్యవసాయ పరికరాలు ప్రదర్శనలో ఉంచారు. అనంతరం ఉత్తమ రైతులను సత్కరించారు.

మూడు సంఘాలు ఏర్పాటు చేసిన నవీన్

నేడు అన్ని జిల్లాల అధ్యక్షులతో కీలకసమావేశం



నవీన్ పట్నాయక్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బిజద అధినేత నవీన్ పట్నాయక్ పార్టీని బలోపేతం చేయడానికి సన్నద్ధమయ్యారు. బుధవారం రాత్రి ఈ దిశగా మూడు సంఘాలు ఏర్పాటు చేశారు. శుక్రవారం భువనేశ్వర్ శంఖభవన్ (బిజద కార్యాలయం)లో అన్ని జిల్లాల పార్టీ అధ్యక్షులతో కీలక సమావేశం చేపట్టనున్నారు. గాంధీజయంతి (అక్టోబరు 2) నుంచి జయప్రకాశ్ నారాయణ్ జయంతి (అక్టోబరు 11) వరకు బిజద రాష్ట్రవ్యాప్తంగా జనసంపర్క ప్రక్రియ చేపడుతుంది. సభ్యత్వ నమోదుకు ప్రాధాన్యమిస్తోంది. ఈ నేపథ్యంలో అన్ని జిల్లాల నాయకత్వాలకు నవీన్ దిశా నిర్దేశం చేయనున్నారు. బుధవారం రాత్రి ఆయన కొంతమంది విధేయులతో సమావేశమై పరిస్థితి సమీక్షించారు. సీనియర్ నేత దేవీప్రసాద్ మిశ్ర అధ్యక్షతన 16 మందితో సలహాసంఘం ఏర్పాటు చేశారు. మరో నేత అతాను సవ్యసాచి నాయక్ నాయకత్వంలో 22 మందితో సభ్యత్వ నమోదు సంఘం, సంజయ్ దాస్ వర్మ అధ్యక్షతన 21 మందితో కార్యక్రమాల అమలు సంఘం ప్రారంభించారు. శుక్రవారం జరగనున్న జిల్లాల అధ్యక్షుల సమావేశంలో కీలక నిర్ణయాలు జరుగుతాయని దేవీ ప్రసాద్ మిశ్ర విలేకరులకు చెప్పారు.
26ఎస్ ఎమ్ జీ 15- శిబిరంలో పాల్గొన్న దివ్యాంగులు

శ్రమదానంతో రహదారికి మరమ్మతులు



మట్టిని చదును చేస్తున్న గ్రామస్థులు

జయపురం, న్యూస్‌టుడే: తమ గ్రామానికి రహదారి నిర్మించాలని పదేపదే విన్నవించినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడంతో గ్రామ యువకులు నడుం బిగించి శ్రమదానం చేశారు. గుంతల్లో మట్టి పోసి చదును చేశారు. కొరాపుట్ జిల్లా దసమంతపూర్ సమితి జానిగూడలో దాదాపు 50 ఆదివాసీ కుటుంబాలు నివసిస్తున్నాయి. సమితి కార్యాలయానికి 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ గ్రామానికి సరైన రహదారి లేదు. జానిగూడ - కుసుమగూడ వరకు రహదారి అధ్వానంగా ఉంది. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో గురువారం గ్రామానికి చెందిన యువకులు ఒక్కటై మట్టి పోసి శ్రమదానంతో మట్టి రహదారి ఏర్పాటు చేశారు. ఈ విషయంపై సర్పంచి సుబాయి ముదులి మాట్లాడుతూ ఈ రహదారి నిర్మాణం గురించి స్పందన కార్యక్రమంలో పాలనాధికారి దృష్టికి తీసుకెళ్లామని, దసరా తరువాత నిధులు మంజూరు కాగానే నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని తెలిపారన్నారు.

జీతాలు విడుదల చేయాలని డిమాండ్



పాలనాధికారి కార్యాలయం ప్రాంగణంలో మహిళలు



రాయగడ..

పర్లాఖెముండి, రాయగడ, న్యూస్‌టుడే: గజపతి, రాయగడ జిల్లాలకు చెందిన ఎంబీకే, సీఆర్‌పీ, కృషి మిత్ర, ప్రాణి మిత్ర, బ్యాంకు మిత్ర తదితర సేవలందిస్తున్న మహిళా సంఘాల మహిళలు గురువారం ముఖ్యమంత్రి పేరిట రాసిన వినతి పత్రాలను పాలనాధికారి, జడ్పీ కార్యనిర్వహణ అధికారి, మిషన్ శక్తి, ఓఎల్‌ఎం అధికారులకు అందజేశారు. యూనియన్ అధ్యక్షురాలు మధుస్మిత దొండ సేన మాట్లాడుతూ గ్రామపంచాయతీ స్థాయిలో పని చేస్తున్న తమకు ఆరు నెలలుగా బకాయి జీతాలు ఇవ్వడం లేదన్నారు. కుటుంబ పోషణ కష్టంగా ఉందని, అధికారులు స్పందించి జీతాలు ఇవ్వాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

నవరంగపూర్: నవరంగపూర్ జిల్లా పపదహండి సమితి మైదల్‌పూర్ ఠాణా పరిధి ఖడక్‌పొదర మలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, ఇద్దరు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం కలహండి జిల్లా ధర్మగఢ్ ఠాణా పరిధికి చెందిన సంతుపూజారి(30), రీతిక సాగర్, సమీర్ సునాని కారులో నవరంగపూర్ నుంచి కలహండికి వెళ్తున్నారు. ఖడక్‌పొదర మలుపు వద్ద కారు అదుపు తప్పి ఆగి ఉన్న ట్రక్కును ఢీకొట్టారు. క్షతగాత్రులను స్థానికులు పపదహండి ఆసుపత్రికి తరలించారు. సంతు పరిస్థితి విషమించడంతో నవరంగపూర్ జిల్లా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పరీక్ష అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. దర్యాప్తు ప్రారంభించారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి, ముగ్గురికి గాయాలు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: విద్యుదాఘాతానికి గురై ఒకరు దుర్మరణం చెందగా, మరో ముగ్గురు గాయాలు పాలైన ఘటన జిల్లా కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక రైతు కాలనీలో నిర్మాణదశలో ఉన్న ఓ ఇంటి గోడలకు కూలీలు సున్నం వేస్తున్నారు. ఇంటి ముందుగా ఉన్న విద్యుత్తు తీగలు గోడకు తాకి విద్యుత్తు సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురయ్యారు. ప్రమాదంలో అంబగూడకు చెందిన దుశ్శాశన ఖొర (35) మృతిచెందగా, బినోద్ నాగ్ (32), లక్ష్మణ కొందపాణి (33), దామోదర్ ఘంటా (26)లకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

నందన్‌కానన్‌లో గున్న ఏనుగు మృతి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్ నందన్‌కానన్ జంతు ప్రదర్శనశాలలో గురువారం సాయంత్రం 18 నెలల వయసు గల గున్న ఏనుగు మృతి చెందింది. ఇటీవల కేంఝర్ నుంచి దీనిని తెచ్చారు. అనారోగ్యానికి గురి కావడంతో 19వ తేదీ నుంచి చికిత్స అందిస్తున్నా మృతి చెందింది.

బంగారం, నగదు చోరీ

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా మోహన ఠాణా పరిధిలో ఓ బంగారం దుకాణం వద్ద బుధవారం రాత్రి చోరీ జరిగింది. వివరాల్లోకి వెళితే.. యజమాని బి.మోహన్ రావు ఇంటికి వెళ్లేందుకు దుకాణం మూసి బంగారం, వెండి సామగ్రి, నగదు ఓ సంచిలో పెట్టి పక్కన ఉంచగా, గమనిస్తున్న దొంగలు సంచిని దొంగిలించి పరారయ్యారు. ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కిలో బంగారం, రూ.లక్ష నగదు, వెండి సంచిలో ఉంది.

క్రీడా పార్కులో అగ్ని ప్రమాదం

జయపురం, న్యూస్‌టుడే: జయపురం నువాసాహిలోని క్రీడా పార్కులో బుధవారం అర్ధరాత్రి అగ్నిప్రమాదం జరిగింది. వివిధ ఆట సామగ్రి, కుర్చీలు బూడిదయ్యాయి. కొందరు దుండగులు అర్ధరాత్రి పార్కు తలుపులు పగలగొట్టి, వ్యాయామ సామగ్రి దొంగలించి, అనంతరం నిప్పంటించారని స్థానికులు ఠాణాలో ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ● జయపురం సమితి కలాగూడ, డిమ, బర్నిపుట్, పూజారి గుడ ప్రాంతాల్లో గురువారం అబ్కారీ శాఖ అధికారులు దాడులు జరిపారు. దాదాపు 2500 లీటర్ల సారా ధ్వంసం చేశారు.

ఎన్‌పీఎస్, యూపీఎస్‌లకు వ్యతిరేకంగా ధర్నా



దక్షిణ మండల ఆర్డీసీ కార్యాలయం బయట విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధుల ధర్నా



పర్లాఖెముండి..

బ్రహ్మపుర నగరం, పర్లాఖెముండి, న్యూస్‌టుడే: కొత్త పింఛన్ పథకం (ఎన్‌పీఎస్), యూనిఫైడ్ పింఛను పథకం (యూపీఎస్)లను రద్దు చేయాలని ఒడిశా రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు డిమాండు చేశారు. గురువారం సంఘం గంజాం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దక్షిణ మండల ఆర్డీసీ కార్యాలయం బయట ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ధర్నా జరిగింది. అనంతరం సంఘం అధ్యక్షుడు డి.మోహనరావు నాయకత్వంలో ప్రతినిధుల బృందం ప్రధాని, ముఖ్యమంత్రి పేరిట వినతిపత్రాలను ఆర్డీసీ కార్యాలయం అధికారులకు అందజేశారు. ● పర్లాఖెముండిలో సలహాదారు పూర్ణచంద్ర మహాపాత్ర్ అధ్యక్షతన ఓ బృందం పాలనాధికారి బిజయ్‌కుమార్‌ను కలిసి ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి పేరిట రాసిన వినతిపత్రం అందజేశారు.

అభివృద్ధి పనుల పరిశీలన



ఆసుపత్రి ప్రాంగణంలో అధికారులతో చర్చిస్తున్న ఆర్ముగమ్

జయపురం, కొరాపుట్, న్యూస్‌టుడే: రాష్ట్ర కార్మిక, ఈఎస్‌ఐ ప్రధాన కార్యదర్శి చిత్ర ఆర్ముగమ్ గురువారం కొరాపుట్, జయపురం పట్టణాల్లో పర్యటించారు. మొదటి జిల్లా ప్రధాన ఆసుపత్రిలో భవన నిర్మాణ పనులు పరిశీలించారు. త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. జిల్లా విజ్ఞాన కేంద్రం సందర్శించారు. ఆమె వెంట పాలనాధికారి కీర్తివాసన్, సీడీఎంవో డా.సుశాంత్‌కుమార్ దాస్, సీడీవో దేబాశిష్ పట్నాయక్, జిల్లా విద్యాధికారి డా.ప్రశాంత్ కుమార్ మహంతి తదితరులు పాల్గొన్నారు. ● కొరాపుట్‌లో గురువారం కార్మిక, ఉపాధి శాఖ ప్రధాన కార్యదర్శి చిత్రా ఆర్ముగం సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. పనులు వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు.



‘సేవ, సమర్పణ అభియాన్’ సేవా వారోత్సవాల్లో భాగంగా గురువారం బ్రహ్మపుర శాసన సభ్యుడు కె.అనిల్ కుమార్ నాయకత్వంలో సేవా కార్యక్రమం జరిగింది. గంజాం జిల్లా హెడ్‌క్వార్టర్ హాస్పిటల్ సిటీ ఆసుపత్రిలో రోగులకు ఆయన పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాజపా నాయకులు రామచంద్ర పండా, బద్రి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

–న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం



రూ.1.65 లక్షలు పలికిన లడ్డూ

జయపురం పట్టణంలోని భద్రసాహి యువ జన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి లడ్డూ వేలంపాట జరిగింది. ఇందులో రూ.1.65 లక్షలకు ఓడి-10 బాలుర బృందం దక్కించుకుంది. గురువారం గణేషుని కల్యాణం, అన్నప్రసాద వితరణ నిర్వహించారు.

– న్యూస్‌టుడే, జయపురం

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



లిఫ్టింగ్‌లో బరువులెత్తుతున్న బాలిక

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: బ్రహ్మపుర మహాత్మాగాంధీ మైదానంలో జరిగిన జిల్లాస్థాయి పాఠశాలల వెయిట్‌లిఫ్టింగ్, బాస్కెట్ బాల్, బాక్సింగ్ పోటీలు బుధవారం రాత్రి ముగిశాయి. పోటీల అనంతరం ఇండోర్‌హాలు, మైదానం ప్రాంగణంలో ఆయా క్రీడాంశాల్లో మొదటిమూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు పతకాలు అందజేశారు. ఇందులో రాష్ట్ర పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా శారీరక విద్యాధికారి భగీరథ స్వయిన్ ‘న్యూస్‌టుడే’తో మాట్లాడుతూ ఈ మూడు క్రీడల్లో మొదటిమూడు స్థానాల్లో నిలిచిన విజేతలకు శిక్షణ శిబిరం నిర్వహిస్తామని, అందులో ఉత్తమ ఆట కనబరిచిన వారిని జిల్లా పాఠశాలల జట్టుగా ఎంపిక చేస్తామని చెప్పారు.

పవర్‌లిఫ్టింగ్‌లో జయపురానికి నాలుగు పతకాలు



పతకాలు, ప్రశంసా పత్రాలు చూపిస్తున్న విజేతలు, తదితరులు

జయపురం, న్యూస్‌టుడే: ఇటీవల భువనేశ్వర్‌లో ఉత్కళ్ కరాటే స్కూల్ తరపున జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జయపురానికి నాలుగు పతకాలు వరించాయి. 65 కిలోల సబ్ జూనియర్ విభాగంలో ప్రత్యేష్ నాయక్‌కు స్వర్ణం, 66 కిలోల బెంచ్‌ప్రెస్‌లో ఆదిత్య త్రిపాఠికి రజతం, 83 కిలోల జూనియర్ విభాగంలో బి.సాయిరాజు, సీనియర్ విభాగంలో ఘస్సీరామ్ హరిజన్‌లు కాంస్య పతకాలు సాధించారు.

అంతర్జాతీయ పోటీలకు నవరంగపూర్ బాలిక



మనీషా మాఝి

నవరంగపూర్: మలేషియాలో ఈ నెల 28వ తేదీన జరగనున్న అండర్-18 రగ్బీ చాంపియన్‌షిప్‌నకు నవరంగపూర్ జిల్లాకు చెందిన మనీషామాఝి ఎంపికైంది. ఆమెకు పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. పపదహండి సమితి మైదల్‌పూర్ పంచాయతీ చారముల గ్రామానికి చెందిన ధనుంజయ్ మాఝి కుమార్తె మనీషా ఇటీవల కోల్‌కత్తాలో జరిగిన అంతరాష్ట్ర రగ్బీ పోటీల్లో గెలిచి భారత్ జట్టుకు ఎంపికైంది.

వందలాది మంది పేదలకు భోజనాలు



పేదలకు రుచికరమైన భోజనాలు వడ్డిస్తున్న సంఘం ప్రతినిధులు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: జాతీయ కేటరర్స్ దినోత్సవం సందర్భంగా బ్రహ్మపుర కేటరర్స్ సంఘం ఆధ్వర్యంలో గురువారం సేవా కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం బిజు పట్నాయక్ కల్యాణ మండపంలో వందలాది మంది పేదలకు రుచికరమైన భోజనాలు వడ్డించారు. అంతకుముందు జరిగిన సమావేశంలో సంఘం ప్రతినిధులు పాల్గొని పలువుర్ని సత్కరించారు.

భూమి పట్టాలు పంపిణీ

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గజపతి జిల్లా మోహన సమితి గోవిందపూర్ పంచాయతీ కార్యాలయంలో గురువారం అటవీ భూమి పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ సత్యవాన్ నాయక్, బీడీవో రాజీవ్ దాస్, రెవెన్యూ సూపర్వైజర్ మిఖిల్ రైకా పాల్గొని 66 మంది లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. సర్పంచి ఇస్మాయిల్ దొల బెహర, ఆధార్ జిల్లా మేనేజర్ పి.శ్యాం కుమార్, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి



పుస్తకాన్ని చూపిస్తున్న అతిథులు

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: గుసాని సమితి ఆర్.సీతాపురంలోని సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో గురువారం వికసిత్ భారత్‌పై అంతర్జాతీయ సమావేశం నిర్వహించారు. రెండు రోజుల పాటు జరిగే ఇందులో డైరెక్టర్ జనరల్ నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ (దిల్లీ) ప్రొఫెసర్ మోని మాదస్వామి, ఓఆర్‌ఎస్‌ఐ కార్యదర్శి ప్రొఫెసర్ ఆర్‌ఎన్ సుబుద్ధి, కన్వీనర్ డాక్టర్ ప్రజ్ఞ పాణి, విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ సుప్రియ పట్నాయక్, రిజిస్ట్రార్ అనిత పాత్ర్ పాల్గొన్నారు. అన్ని రంగాల్లో అభివృద్ధి లక్ష్యంగా భారత్ ముందుకు సాగుతోందన్నారు. విశ్వ విద్యాలయం ప్రాంగణంలో విద్యార్థులు తయారుచేసిన ఆధునిక వ్యవసాయ యంత్రాలు, ఔషధీయ మొక్కలు ప్రదర్శనలో ఉంచారు. అనంతరం పుస్తకం ఆవిష్కరించారు.

‘అవి ఫోర్టిఫైడ్ బియ్యం’



ఫోర్టిఫైడ్ బియ్యం గురించి విద్యార్థులకు వివరిస్తున్న ఎఫ్‌సీఐ ఉద్యోగి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: జాతీయ ఆరోగ్య భద్రత కింద పంపిణీ చేస్తున్న బియ్యంలో శరీరంలో రక్తహీనతను దూరం చేసే ‘ఫోర్టిఫైడ్’ బియ్యం కలిపి పంపిణీ చేస్తున్నారని, వాటిని కొందరు ప్లాస్టిక్ బియ్యంగా భావించి ఏరి పారేస్తున్నారని ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) అధికారులు పేర్కొన్నారు. బ్రహ్మపుర శివారున జగన్నాథపూర్‌లోని ఎఫ్‌సీఐ గోదాము ఉద్యోగుల ఆధ్వర్యంలో బుధవారం ఫోర్టిఫైడ్ బియ్యంపై చైతన్య కార్యక్రమం జరిగింది. నరేంద్రపూర్‌లోని సరస్వతీ విద్యా మందిర్ విద్యార్థులు, ఇతరులు పాల్గొనగా, వారికి ఫోర్టిఫైడ్ బియ్యం ప్రత్యేకతను ఎఫ్‌సీఐ ఉద్యోగులు వివరించారు.



చక్రాల కుర్చీలతో దివ్యాంగులు. వెనుక బీడీవో రాజీవ్

చక్రాల కుర్చీలు అందజేత

సిమిలిగుడ, పర్లాఖెముండి, న్యూస్‌టుడే: సిమిలిగుడ, గజపతి జిల్లా మోహనలలో గురువారం దివ్యాంగుల గుర్తింపు శిబిరం నిర్వహించారు. నేతలు, అధికారులు పాల్గొని దివ్యాంగులకు వినికిడి యంత్రాలు, చక్రాల కుర్చీలు, పింఛన్లు, చేతికర్రలు, బస్‌పాస్‌లు అందజేశారు. పేర్లు నమోదు చేసుకున్న దివ్యాంగులకు గుర్తింపు పత్రాలు ఇచ్చారు. వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అతిథులన్నారు.



న్యాయమైన పది డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ ది ఒడిశా నర్సింగ్ ఉద్యోగుల సంఘం ఇచ్చిన పిలుపు మేరకు సిటీ ఆసుపత్రి ఉద్యోగులు గురువారం ఆందోళన చేపట్టారు. దీంతో ఆసుపత్రిలో వైద్య సేవలకు కొంత అంతరాయం ఏర్పడింది.

–న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం



గంజాం జిల్లా హెడ్‌క్వార్టర్ ఆసుపత్రి, సిటీ ఆసుపత్రిలో అస్తవ్యస్తంగా మారిన వైద్య సేవల్ని చక్కదిద్దాలని స్థానిక మానవ అధికార్ సురక్షా మంచ్ డిమాండు చేసింది. గురువారం మంచ్ ప్రముఖుడు అబనీ గయ నాయకత్వంలో పలువురు ప్రతినిధులు జిల్లా ముఖ్య వైద్యం, ప్రజారోగ్య అధికారి (సీడీఎం, పీహెచ్‌ఓ) కార్యాలయం బయట ప్రదర్శన నిర్వహించారు.

–న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం

సీఎంసీ కమిషనర్‌గా పాత్ర్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కటక్ నగరపాలక సంస్థ (సీఎంసీ) కమిషనర్‌గా ఓఏఎస్ అధికారి అనామచరణ్ పాత్ర్ నియమితులయ్యారు. బుధవారం రాత్రి అధికార వర్గాలు తెలిపిన వివరాల మేరకు కల్పతరు బెహరా సీఎంసీ సహాయ కమిషనర్‌గా, ప్రదీప్‌కుమార్ రౌత్ ఒకాక్ (ఒడిశా కంప్యూటర్ అకాడమీ సెంటర్)సంచాలకునిగా నియమితులయ్యారు. మరోవైపు గురువారం 43 సమితులకు బీడీవోలను నియమించారు.

● **కొరాపుట్:** జిల్లా కేంద్రం కొరాపుట్‌లో మూడు రోజులు నిర్వహించిన స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో దాదాపు 3 క్వింటాళ్ల చెత్త సేకరించినట్లు పురపాలిక అధ్యక్షుడు లలత్ రంజన్ సెఠి తెలిపారు. ఆ వ్యర్థాలను మిషన్‌శక్తి కేంద్రానికి అప్పగించినట్లు చెప్పారు. వీటి నుంచి సేంద్రియ ఎరువులు తయారు చేస్తారు.

● **గుణుపురం:** గుణుపురం కళాశాల ఆవరణలో గురువారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ప్రధానాచార్యుడు శశిభూషణ మహంతి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొని ఆవరణలోని చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేశారు.

● **జయపురం:** జయపురం పట్టణంలో స్వామినాథన్ సంస్థ, వ్యవసాయ విభాగం తరపున గురువారం ఆహార పదార్థాల ప్రదర్శన కార్యక్రమం జరిగింది. జిల్లా వ్యవసాయశాఖాధికారి అచ్చున్ మాఝి, సంస్థ డైరెక్టర్ డా.ప్రశాంత్ పరిడా పాల్గొన్నారు.

● **భువనేశ్వర్:** దసరా ఉత్సవాల నేపథ్యంలో కటక్ నగర వీధుల్లో తోరణాలు ఏర్పాటు చేయొద్దని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. వీధుల్లో అడ్డదిడ్డంగా ఉన్న కేబుల్, విద్యుత్తు తీగలు సరిచేయాలని ఆదేశించింది. రహదారులకు మరమ్మతులు చేయాలని ఇదివరకే న్యాయస్థానం ఆదేశించిన నేపథ్యంలో అక్టోబరు 5లోగా పనులు పూర్తి చేస్తామని ప్రజా పనులశాఖ కార్యదర్శి న్యాయస్థానానికి తెలిపారు.

సంక్షిప్త సమాచారం

● **సిమిలిగుడ:** తమ గ్రామం నుంచి భారత్ మాల రహదారి వరకూ బైపాస్ రోడ్డు నిర్మించాలని గంటిమడ గ్రామ ప్రజలు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా పాలనాధికారి కీర్తివాసన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తమ అవసరాలకు ఆంధ్రలోని విజయనగరం, విశాఖ పట్టణం, అరుకు ప్రాంతాలకు వెళ్తున్నామని, భారతమాల వల్ల ఆ అవకాశం కోల్పోతామని, తమకు న్యాయం చేయాలని కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.

● **కొరాపుట్:** కొరాపుట్ శబరి శ్రీక్షేత్రంలో గురువారం భైరవి అవతారంలో విమలాదేవి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు.

● జిల్లాకేంద్రంలో పురపాలిక అధ్వర్యంలో పాఠశాల విద్యార్థుల స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా సృజనాత్మక ప్రాజెక్టులపై పోటీ నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలకు చెందిన మాధురి చేసిన కార్టూన్ బొమ్మకు ప్రథమ బహుమతి లభించింది. పురపాలిక ఛైర్మన్ లలత్ రంజన్ సెఠి విజేతలకు బహుమతులు అందజేశారు.

● **పర్లాఖెముండి:** పర్లాఖెముండిలోని జిల్లా న్యాయస్థానంలో న్యాయసేవల అథారిటీ ఆధ్వర్యంలో గురువారం సామాజిక మాధ్యమాలు, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంబంధిత శాఖ నిపుణుడు సంజయ్ పాఢి, జిల్లా న్యాయమూర్తి ప్రణబ్ కుమార్ రౌత్రయ్, జిల్లా ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి అశోక్ కుమార్ పోహి పాల్గొన్నారు.

● గుసాని సమితి గురండి సామాజిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం క్షయ వ్యాధిపై అవగాహనకు ప్రచార రథం ప్రారంభించారు. వైద్య సిబ్బంది గోడ పత్రికలు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. మధుమేహం ఉన్నవారు, ధూమపానం చేసే 18 ఏళ్ల పైబడిన వారు క్షయ వ్యాధి టీకాలు వేసుకోవాలని వైద్యుడు ప్రతిత్ పవన్ బారిక్ అన్నారు.

● **ఖరగ్‌పూర్:** ఖరగ్‌పూర్ సబ్ డివిజన్ ఆసుపత్రి అత్యవసర విభాగం వద్ద ఈ రిక్షాలు, ఇతర వాహనాలు నిలపరాదని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ధిమాన్ బెనర్జీ బుధవారం చెప్పారు. పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. దీని వల్ల రోగులను తీసుకొచ్చే అంబులెన్స్‌లకు ఇబ్బంది కలుగుతోందన్నారు.

● **భువనేశ్వర్:** ఔట్ సోర్సింగ్ విధానం రద్దు, ఉద్యోగోన్నతులు, తాత్కాలికంగా విధులు నిర్వహిస్తున్న వారికి క్రమబద్ధీకరణ తదితర డిమాండ్లతో రాష్ట్ర వ్యాప్తంగా నర్సింగ్ అధికారిణులు చేస్తున్న సమ్మె గురువారం రెండోరోజుకు చేరింది. వారు అత్యవసర సేవలు మాత్రమే చేపడుతున్నారు.

● **రాయగడ పట్టణం:** వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్‌ఎం) సౌరభ్ ప్రసాద్ గురువారం రాయగడలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రత్యేక రైలులో రాయగడ స్టేషన్‌కు చేరుకున్న ఆయన ఇక్కడ నుంచి ట్రాలీలో బయలుదేరారు. ముందుగా బారిజోల రహదారిలోని రైల్వే లెవెల్ క్రాసింగ్ గేటులో తనిఖీ చేశారు. అనంతరం డీఆర్‌ఎం కార్యాలయం నిర్మించనున్న స్థలాన్ని పరిశీలించారు. పలు అభివృద్ధి పనులపై డీఆర్‌ఎం సమీక్షించినట్లు రైల్వే వర్గాలు వెల్లడించాయి.

● **సిమిలిగుడ:** సిమిలిగుడ పట్టణంలో బుధవారం రాత్రి భారీ వర్షం కురిసింది. రోడ్లు జలమయమయ్యాయి. మురుగు కాల్వల్లో చెత్త పేరుకుపోయి వరద నీరు రహదారులపై ప్రవహించింది. ఓసీసీ నగర్, ఇందిరానగర్, అంబేడ్కర్ నగర్, సరస్వతీ నగర్, గాంధీనగర్, మెయిన్ రోడ్డు ప్రాంతాల్లో అధ్వాన పరిస్థితి నెలకొంది. రోడ్లు కోతకు గురయ్యాయి. గురువారం పురపాలక అధ్యక్షుడు రాజేంద్ర కుమార్ పాత్ర్, కార్యనిర్వాహక అధికారి నారాయణ నాయక్, సహాయ ఇంజినీర్ మనోజ్ పాత్ర్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు.

పారిశుద్ధ్యం మెరుగుపరచాలి

బీఈఎంసీ మండలి సమావేశం

బ్రహ్మపుర బజారు, న్యూస్‌టుడే: బ్రహ్మపుర పురపాలక సంఘం (బీఈఎంసీ)లోని కొన్ని వార్డుల్లోకి చెత్త సేకరించే వాహనాలు ప్రతిరోజు రావడం లేదని, దీనివల్ల చెత్త పేరుకు పోవడంతో సమస్య తీవ్రమవుతోందని కార్పొరేటర్లు ఆరోపించారు. బీఈఎంసీ సమావేశమందిరంలో గురువారం మండలి సమావేశం జరిగింది. మేయరు సంఘమిత్ర దొళాయి అధ్యక్షతన ఏర్పాటైన ఇందులో కమిషనర్ భవానీప్రసాద్ మిశ్ర, ఉప మేయరు వివేక్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రతినిధి అశోక్‌కుమార్ శుక్లాలు పాల్గొన్నారు. పలువురు కార్పొరేటర్లు మాట్లాడుతూ పారిశుద్ధ్యం నిర్వహణ పనులు చేపడుతున్న ప్రైవేట్ ఏజెన్సీల పనితీరు సంతృప్తికరంగా లేదన్నారు. మరికొన్ని వార్డుల్లోకి మూడు రోజులుగా వాహనాలు రావడంలేదన్నారు. దీనిపై పలుమార్లు ఉపకమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్తు నియంత్రికలు (ట్రాన్స్‌ఫార్మర్లు) రహదారులు, కాలువలకు అడ్డంగా ఉన్నాయని, వాటిని వేరేచోటుకు మార్చాలని విద్యుత్తు విభాగం అధికారులకు చెప్పినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మేయరు, కమిషనర్‌లకు చెప్పారు. సమస్యలు విన్న మేయరు దొళాయి మాట్లాడుతూ పారిశుద్ధ్యం పనులు చేస్తున్న ప్రైవేట్ ఏజెన్సీలపై చర్యలు తీసుకుంటామన్నారు. విద్యుత్తు విభాగం అధికారులతో చర్చించి వీలైనంత త్వరగా ఆయా పనులు జరిగేలా చూస్తామని చెప్పారు. వీటితోపాటు మరికొన్ని అంశాలపై చర్చ జరిగింది. అవి ఇవీ.

● బీఈఎంసీ రహదారుల్లో తిరుగుతున్న ఆవులను వేరేచోటకు తరలించి, వాటి యజమానుల నుంచి జరిమానా వసూలు చేయాలి. ● స్మార్ట్ విద్యుత్తు మీటర్ల వల్ల బిల్లులు ఎక్కువగా వస్తున్నాయి. వాటిని తొలగించాలి. ● టౌన్‌హాలు వద్ద బీఈఎంసీ స్థలంలో అనధికారంగా వ్యాపారం చేస్తున్న బార్‌ను తొలగించాలి.

● మండలి, స్టాండింగ్ కమిటీల సమావేశాల్లో తీసుకున్న నిర్ణయాలను అమలుచేయాలి.


సమావేశం ప్రారంభంలో బీఈఎంసీ పరిధిలో బయో గ్యాస్ సరఫరాపై చర్చ జరిగింది. దీనిపై ఓ గ్యాస్ ప్లాంట్ ప్రతినిధులు మాట్లాడుతూ శితలాపల్లి, మొహుడాలలో ఇందుకోసం ఓ ప్లాంటు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించారు. దీనివల్ల నగరవాసులకు గ్యాస్ సరఫరా చేయొచ్చని వారన్నారు. ఇందుకోసం బీఈఎంసీ సహకరించాలని కోరారు. మరోవైపు సిద్ధార్థనగర్ ప్రాంతంలో నిర్మాణ యోచనలో ఉన్న కొత్త వెండింగ్‌జోన్ వీడియో క్లిప్‌ను ప్రదర్శించారు. సమావేశంలో ఉపకమిషనర్ ఆశీర్వాద్ పరిడా, సహాయ కమిషనర్లు నరేంద్ర ప్రధాన్, రోనిత్‌కుమార్, వార్డు కార్పొరేటర్లు, వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




హాజరైన వివిధ వార్డుల కార్పొరేటర్లు, మాట్లాడుతున్న కమిషనర్ మిశ్ర: చిత్రంలో మేయరు దొళాయి, ఉపమేయరు వివేక్‌రెడ్డి ఇతరులు

నన్ను కొట్టింది.. అందుకే చంపేశా

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే: 'ఆమె.. నా వ్యక్తిగత విషయాలను ప్రస్తావిస్తూ గొడవపడి దాడి చేసి కొట్టింది. ఆత్మాభిమానం దెబ్బ తిన్నడంతో ఆమెపై ప్రతిదాడి చేసి గొంతు నులిమి కడతేర్చా. మృతదేహాన్ని స్నానం గదిలోకి తీసుకువెళ్లి ఆక్సల్ బ్లేడ్‌తో 59 ముక్కలు చేసి.. ఫ్రిజ్‌లో ఉంచా. వాసన రాకుండా రసాయనాలను పిచికారి చేసి, స్నానాల గదిని శుభ్రం చేసి.. ఆ ఇంటికి తాళం వేసి రైల్లో ఒడిశాలోకి మా ఊరికి వచ్చా' అంటూ బెంగళూరులో సంచలనానికి కారణమైన మహాలక్ష్మి హత్య కేసు నిందితుడు ముక్తిరంజన్ రాయ్ తన మరణోత్తర లేఖలో ప్రస్తావించాడు. ఆ లేఖరాసి.. చివరికి ఆయన బుధవారం చెట్టుకు తాడుతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. వయ్యాలికావల్ మునేశ్వర బ్లాక్‌లో నేపాలీ యువతి మహాలక్ష్మిని రాయ్ చంపిన తీరు దిగ్భ్రాంతికరం. ఆయనను పట్టుకోవడానికి బెంగళూరు పోలీసులు ప్రయత్నిస్తున్న వేళ.. చివరికి ఒడిశాలోని ఫండి గ్రామ శ్మశానవాటికలో ఓ చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. అక్కడున్న లేఖతోపాటు ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్లను దర్యాప్తు అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ నెల 24న రాత్రి ద్విచక్రవాహనంలో బయటకు వెళ్లిన రాయ్.. మరుసటి రోజు కుళేవాడ శ్మశానవాటికలో ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించామని దుశిరి పోలీసుఠాణాలో స్థానికులు ఫిర్యాదు చేశారు. రాయ్- లక్ష్మి ఇద్దరూ మల్లేశ్వరంలోని ఓ సంస్థలో పని చేస్తున్నారు. ఇద్దరి మధ్య ప్రేమ మొగ్గతొడిగి.. సహజీవనం సాగించారు. ఆ కర్మాగారంలో టీమ్ మేనేజరుగా పనిచేసిన రాయ్ ఇతర యువతులతో చనువుగా మాట్లాడడం ఆమెకు ఆగ్రహం తెప్పించి గొడవకు దిగేదని తేలింది. ఓ బిడ్డకు తల్లైన ఆమెతో పెళ్లికి రాయ్ నిరాకరించాడు. వారం రోజులు సెలవుపెట్టిన ఆమె ఉంటున్న గదికి రాయ్ 21న సాయంత్రం వెళ్లిన సమయంలో గొడవ పతాక స్థాయికి చేరిందని రాయ్ లేఖ ద్వారా గుర్తించారు. 'నాతో గొడవకు దిగి దాడిచేసింది. కోపం పట్టలేక ఆమెను కొట్టాను. గొంతు నులిమేసరికి చనిపోయింది. ఏమి చేయలో అర్థం కాక.. బయటకు వెళ్లి ఆక్సల్ బ్లేడ్ తెచ్చి మృతదేహాన్ని స్నానాల గదిలోకి లాక్కువెళ్లి ముక్కలుగా చేశా. వాటిని ఫ్రిజ్‌లో కుక్కా' నంటూ లేఖలో రాశాడు.



ఒడిశాలోని ఓ శ్మశాన వాటికలో ముక్తి రంజన్‌రాయ్.. చివరికిలా మిగిలాడు



మహాలక్ష్మి (పాతచిత్రం)

రోడ్డంటే ఖాతరు లేదు.. సమస్య పట్టింపు

అలికాం- బత్తిలి అంతర్రాష్ట్ర రహదారి.. శ్రీకాకుళం ఒడిశా ప్రాంతాలకు కలుపుతూ సాగే ఈ దారిలో నిత్యం వందల గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తారు.. భారీ వాహనాలు సైతం ఇటువైపే వెళతాయి. జిల్లాలో కీలక మార్గం అధ్వానంగా మారినా అధికారులు పట్టించుకోలేదు. ప్రమాదాలు జరుగుతున్నా చలనం లేదు.. వాహనాలు గోతుల్లోకి కూరుకుపోతున్నాయని ఘోషిస్తున్నా వినేవారు లేరు.. చివరికి మరమ్మతులకు గురవుతున్నా కన్నెత్తి చూడలేదు.. ముఖ్యంగా సరుబుజ్జిలి మండల పరిధిలోనే దారుణ స్థితి ఉంది. షళంత్రి కూడలి నుంచి గోనెపాడు కూడలి వరకు ప్రయాణం చేయాలంటే వాహన చోదకులు నరకాన్ని చూస్తున్నారు. సరుబుజ్జిలి పెట్రోల్ బంకు వద్ద ఏర్పడిన గుంతలు రోజురోజుకు మరింత పెరుగుతున్నాయి. గుంతల్లో దిగిపోయిన వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. వాహన చోదకులు లబోదిబోమంటున్నారు.

– న్యూస్‌టుడే, సరుబుజ్జిలి



వ్యాను బాగు చేసేందుకు కుస్తీలు..



ఏబీ రోడ్డులో పెట్రోల్ బంకు వద్ద గుంతలో దిగిపోయిన ట్రాక్టర్



మరమ్మతులకు గురై రహదారి పక్కన ఆగిపోయిన లారీ

ఆ అయిదింట్లో.. నగదు రహితం

● జనవరి నుంచి ప్రయోగాత్మకంగా అమల్లోకి
● దశలవారీగా మిగిలిన గ్రామాల్లో విస్తరణ

న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్

ఏదైనా ఒక కార్యక్రమం అమలు చేసే ముందు పక్కా ప్రణాళిక ఉండాలి. ఇదేదీ లేకుండా ఉపక్రమిస్తే ఆచరణలో విఫలమయ్యే అవకాశం ఎక్కువ. గత ప్రభుత్వం పంచాయతీల్లో అమలు చేసిన నగదు రహిత లావాదేవీలే ఇందుకు నిదర్శనం. పంచాయతీలు బ్యాంకు ఖాతాలు ప్రారంభించినా, లావాదేవీలకు అవసరమైన క్యూఆర్ కోడ్.. ఈ-పోస్ యంత్రాలు అందుబాటులోకి వచ్చే సరికి జాప్యం చోటుచేసుకుంది. సాంకేతిక సమస్యలు వెంటాడడంతో అమలు పడకేసింది. దీనిని దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం దశలవారీగా చేపట్టాలని నిర్ణయించింది.



ఎంపికైనవి ఇవే..

మండలం	పంచాయతీ
బొబ్బిలి	పిరిడి
గంట్యాడ	కొర్లాం
చీపురుపల్లి	నిమ్మలవలస
పార్వతీపురం	పులిగుమ్మి
కురుపాం	గుమ్మ

తొలుత ఇలా..

2025 జనవరి నుంచి నగదు రహిత లావాదేవీలను నిర్వహించేందుకు చర్యలు చేపడుతోంది. పన్నులు, పన్నేతర ఆదాయం పక్కదారి పట్టకుండా ఉండాలన్నది ఈ విధానం ప్రధాన ఉద్దేశం. ఉమ్మడి జిల్లాలో 1228 పంచాయతీలుండగా.. 5 చోట్ల ప్రయోగాత్మకంగా ప్రారంభించనున్నారు. డెబిట్, క్రెడిట్ కార్డు లేదా క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లించేలా చర్యలు తీసుకోనున్నారు. గ్రామాలకు సంబంధించిన పన్ను, పన్నేతర ఆదాయం వివరాలు త్వరలో పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తారు. ద్వారా ఆధారంగా తెలుసుకుని నగదు కట్టాలి. గిరిజన ప్రాంతాల్లో సాంకేతిక సమస్యలున్న చోట కొన్నేళ్ల పాటు నగదు వసూళ్లనే కొనసాగించే అవకాశముందని పేర్కొంటున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో విజయనగరం జిల్లాకు పన్ను, పన్నేతర ఆదాయం కలిపి రూ.23.47 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా విధించారు.

గత ప్రభుత్వంలో..

కేంద్రం ఆదేశాలతో గత ప్రభుత్వం 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఇంటిపన్ను, సర్‌ఛార్జీలు, రోజు వారీ మార్కెట్ వసూళ్ల ఇలా.. పంచాయతీకి డబ్బు చెల్లించాలంటే నగదు రహిత విధానంలోనే కట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఆన్‌లైన్ విధానంలో నగదు చెల్లింపులు, నెట్ బ్యాంకింగ్ విధానం, కార్యాలయాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పీవోఎస్ యంత్రాల్లో డెబిట్ కార్డులు, ఫోన్‌పే, పేటీఎం, చరవాణిలో క్యూఆర్ కోడ్ స్కాన్ వంటి విధానాల్లో చెల్లింపులు చేయాలి. పంచాయతీలు బ్యాంకు ఖాతాలు ప్రారంభించినా.. లావాదేవీలకు అవసరమైన బ్యాంకు క్యూఆర్ కోడ్.. ఈ-పోస్ యంత్రాలు అందుబాటులోకి వచ్చేసరికి ఆలస్యమైంది. ఈక్రమంలో సిబ్బంది కొందరి నుంచి నగదు, ఇంకొందరి నుంచి ఆన్‌లైన్ విధానంలో వసూలు చేపట్టారు. ఆన్‌లైన్‌లో జమైన సొమ్ము పంచాయతీ ఖాతాలకు రాకపోవడం, సర్వీసు ఛార్జీల్లో కోతపడడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇక నుంచి ఆ పరిస్థితి లేకుండా చూడనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారులు తెలిపారు.

అమృత భారత్ ఆధునిక హంగులు

వేగంగా బొబ్బిలి రైల్వే స్టేషన్ అభివృద్ధి



కొత్త సముదాయ భవనం

'అమృత భారత్' పథకం కింద బొబ్బిలి రైల్వే స్టేషన్‌కు ఆధునిక హంగులు కల్పిస్తున్నారు. పలు రకాల అభివృద్ధి పనులు చేపట్టడంతో బ్రిటిష్ కాలంనాటి ఈ రైల్వే స్టేషన్‌కు ప్రత్యేక శోభ సంతరించుకోబోతోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 26న సుమారు రూ.16 కోట్లతో అధికారులు పనులకు శ్రీకారం చుట్టారు. ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో ఈ పనుల్ని ప్రారంభించారు. – న్యూస్‌టుడే, బొబ్బిలి

ప్రస్తుతం మూడో లైను పనులు ఓవైపు జరుగుతుండగా ప్లాట్‌ఫారాల అభివృద్ధి, ప్రయాణికుల విశ్రాంతి గదులు, రిజర్వేషను కౌంటర్లు, ఇతర పనులు మరోవైపు సాగుతున్నాయి. పాతవి తొలగించి కొత్తవి నిర్మిస్తున్నారు. బుకింగు కౌంటర్, మరికొన్ని షెడ్లను తొలగించారు. కొత్తగా స్టేషన్ భవన సముదాయాన్ని, గూడ్సు షెడ్డు స్థలంలో నూతన భవనాలు నిర్మించారు. బుకింగు కౌంటర్‌ను ఏర్పాటు చేయనున్నారు. విశ్రాంతి గదులు, లోకో పైలట్, ఇతర ఉద్యోగుల విశ్రాంతి గదులు కూడా నిర్మిస్తున్నారు. ఈ పనుల్లో భాగంగానే పట్టణంలోని మల్లంపేట వద్ద నూతన వంతెన నిర్మాణం చేపట్టనున్నారు.

ఏడాదిలోగా..

బొబ్బిలి మీదుగా ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ వంటి ప్రాంతాలకు రైళ్లు వెళ్తున్నాయి. ఇటీవల కొత్తగా మరిన్ని అందుబాటులోకి వచ్చాయి. దీనివల్ల స్టేషన్‌కు ప్రాధాన్యత పెరిగింది. మూడో లైను పనుల్లో భాగంగా అదనంగా మరో ప్లాట్‌ఫారం ఏర్పాటు కానుంది. దీనికి అనుగుణంగా డిజిటల్ సైన్ బోర్డులు, విద్యుదీకరణ వంటివి చేపడుతున్నారు. బుకింగు కౌంటర్ నిర్మిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం తాత్కాలికంగా కంటైనర్‌లో ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నారు. పనులు పూర్తిచేసి ఏడాదిలోగా ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువస్తామని స్థానిక రైల్వే అధికారులు 'న్యూస్‌టుడే'కు వెల్లడించారు.



మూడో వరుస పనులు

కృషి చేస్తాను

బొబ్బిలి రైల్వేస్టేషన్‌కు చరిత్ర ఉంది. ఇటీవల కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడును కలిసి సమస్యలు తెలియజేశాం. అంతర్జాలం ద్వారా రైల్వే డీఆర్ఎంకు విన్నవించాలని సూచించారు. ఆయా సమస్యలు దశల వారీగా పరిష్కారమయ్యేలా కృషి చేస్తాను.

– బేబీనాయన, ఎమ్మెల్యే

వీటికి పరిష్కారం చూపాలి

బొబ్బిలి రైల్వే స్టేషన్‌కు సంబంధించి కొన్ని సమస్యలు ఏళ్లుగా ఉన్నాయి. ఇక్కడి గూడ్సు షెడ్డును మరో చోటుకు తరలించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని హమాలీలు ఆందోళన చేస్తున్నారు. బొబ్బిలి-సాలూరు మధ్య రైలు నడుపుతామని రైల్వే శాఖ ఆరు నెలల క్రితం ప్రకటించింది. ఇంతవరకు కార్యాచరణకు నోచుకోలేదు. ఇది అందుబాటులోకి వస్తే సుమారు 30 గ్రామాలకు సౌకర్యవంతంగా ఉంటుంది. బొబ్బిలి పట్టణ పరిధిలోని మల్లంపేట, ఇందిరమ్మ కాలనీ, బొబ్బిలి మండలం గున్నతోటవలస, దిబ్బగుడివలస, జగనన్న కాలనీలకు వెళ్లాలంటే రైల్వే ట్రాకులు దాటాల్సి ఉంది. ఇక్కడ మినీ వంతెనలు ఏర్పాటు చేయాలి. పట్టణం మీదుగా వెళ్లే వందేభారత్, హడియా-యశ్వంత్‌పూర్ సూపర్‌ఫాస్టు రైళ్లను నిలుపుదల చేయాలని ప్రయాణికులు, ప్రజాప్రతినిధులు ఇటీవల రైల్వే ఉన్నతాధికారులకు వినతులు సమర్పించారు.

బడిదేవర అనుమతులు రద్దుకు డిమాండు

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పార్వతీపురం మండలాన్ని బీడుగా మార్చే బడిదేవర కొండ తవ్వకాలను రద్దు చేయాలని, ప్రభుత్వం ప్రకటించిన రైతు సహాయం రూ.20 వేల అందించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బంటుదాసు డిమాండు చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద మండల రైతులు, సంఘ ప్రతినిధులతో ధర్నా నిర్వహించారు. సమస్యల వినతిపత్రాన్ని ఉప తహసీల్దారు రమణకు అందించారు. వ్యవసాయ కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు రాము, రైతు నాయకులు సత్యనారాయణ, శివంనాయుడు, శంకరరావు, రైతులు, గిరిజనులు పాల్గొన్నారు.

నేడు రాజాంలో ముఖాముఖి

సీతంపేట, న్యూస్‌టుడే: రాజాంలోని నైరెడ్‌లో శుక్రవారం స్త్రీ, పురుషులకు వివిధ శిక్షణలు ఇవ్వనున్నట్లు డైరెక్టర్ ఎం.రాజేష్ తెలిపారు. పురుషులకు ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్, కంప్యూటర్ బేసిక్స్, స్త్రీలకు టైలరింగ్, హోమ్ నర్సింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్ వంటి శిక్షణలు ఇస్తామన్నారు. ఉచిత శిక్షణ, వసతి, భోజన సదుపాయం, ఏకరూప దుస్తులు, టూల్‌కిట్‌లు ఉచితంగా అందిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు ధ్రువపత్రాలు, ఆధార్, రేషన్‌కార్డులతో ముఖాముఖికి హాజరవ్వాలన్నారు.

హైకోర్టు న్యాయమూర్తి పూజలు

కొమరాడ, న్యూస్‌టుడే: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్ రాయ్ మాతృమూర్తి విజయలక్ష్మి ఇటీవల విశాఖలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈ సందర్భంగా గురువారం జంఝావతి, నాగావళి నదుల సంగమంలోని గుంప సోమేశ్వరాలయం సమీపంలో న్యాయమూర్తి పూజలు నిర్వహించారు.

అన్నా, చెల్లెలికి అభివృద్ధి కనిపించడం లేదు

రాహుల్, ప్రియాంకలపై నడ్డా పరోక్ష విమర్శలు



ప్రసంగిస్తున్న జె.పి.నడ్డా

భువనేశ్వర్, న్యూస్‌టుడే: 'వికసిత్ భారత్' ఉత్పత్తులు, ఎగుమతుల్లో అగ్రదేశాలతో పోటీ పడుతోందని, ఆర్థిక రంగంలో ప్రపంచంలో అయిదో స్థానంలో ఉన్నా అన్నా, చెల్లెలికిది కనిపించడం లేదని, వీరిద్దరికీ నిరుద్యోగం, ధరల పెరుగుదల గురించి మాత్రమే మాట్లాడుతున్నారని పరోక్షంగా రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలను ఉద్దేశించి భాజపా కేంద్ర శాఖ అధ్యక్షుడు జె.పి.నడ్డా అన్నారు. గురువారం మధ్యాహ్నం భువనేశ్వర్‌లో జరిగిన వివిధ రంగాల ప్రముఖుల సమావేశంలో పాల్గొన్న నడ్డా నరేంద్రమోదీ మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన వంద రోజుల్లో అనేక నిర్ణయాలు తీసుకున్నారన్నారు. 3 కోట్ల మంది పేదలకు పీఎంఏవై ఇళ్లు, 70 ఏళ్ల వయసు దాటిన వారందరికీ ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్యక్రమం, రూ.10 లక్షల కోట్ల వ్యయంతో కూడిన రైల్వే, రహదారుల నిర్మాణాలు చేపట్టారన్నారు.

7 శాతం వృద్ధి రేటు: అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా, జపాన్, చైనా వంటి దేశాల జీడీపీ 5 శాతానికి పడిపోయిందని, భారత్‌లో ఇది 7 శాతంగా ఉందన్నారు. మొబైల్, ఆటోమొబైల్, ఉక్కు, ప్లాస్టిక్ బొమ్మల ఉత్పత్తి, ఎగుమతుల్లో భారత్ అగ్రగామి అయిందని నడ్డా వివరించారు. ఐఎంఎఫ్ సర్వే ప్రకారం ఆర్థిక రంగంలో భారత్ శక్తిమంతంగా ఉందని నిర్ధారణ అయిందన్నారు. జమ్ముకశ్మీర్‌లో 370 అధికరణ రద్దు తరువాత తొలిసారిగా స్వేచ్ఛగా ఎన్నికలు జరుగుతున్నాయన్నారు.

విదేశాల్లో పెరిగిన గౌరవం: విదేశాల్లో భారత్ గౌరవం గణనీయంగా పెరిగిందని జె.పి.నడ్డా పేర్కొన్నారు. నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ విదేశీ పర్యటనకు వెళ్లిన సమయంలో ఆయా దేశాధినేతలతో ఉగ్రవాదం, పాకిస్థాన్ గురించి మాట్లాడేవారన్నారు. ప్రస్తుత ప్రధాని మోదీ భూతాపం, కాలుష్య నియంత్రణ, సెమీకండక్టర్ల తయారీ, సౌరశక్తి గురించి వివరిస్తున్నారన్నారు.

లౌకికవాదం ముసుగులో..: బంగ్లాదేశ్, పాకిస్థాన్, ఇరాన్, ఇరాక్, అఫ్గనిస్థాన్ తదితర ముస్లిం దేశాల్లో తీన్ తలాక్ పదం లేదని, లౌకికవాదం ముసుగులో దీన్ని భారత్‌లో ఇది వరకు అమలు చేశారని, మోదీ దీన్నుంచి బయటపడేసి ముస్లిం మహిళలకు స్వేచ్ఛ ప్రసాదించారన్నారు.

ఏ పార్టీకి కేడర్ లేదు: భారత్ దేశంలో 5000 రాజకీయ పార్టీలున్నాయని, వాటిలో 50 పార్టీలు క్రియాశీలంగా ఉన్నా, సరైన కేడర్ ఏ పార్టీకీ లేదని నడ్డా అన్నారు. ఎంతో గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్‌లో సభ్యత్వాల నమోదు ప్రహసనం కాగా అంతర్గత ప్రజాస్వామ్యం లేదన్నారు. పశ్చిమబెంగాల్, కేరళల్లో పరస్పరం కలహించుకునే వామపక్షాలు దిల్లీలో కరచాలనాలు చేసుకుంటున్నాయన్నారు. కేవలం భాజపా మాత్రమే విలువలకు కట్టుబడి ఉందని, ప్రధాని నుంచి అట్టడుగు కార్యకర్త వరకు సభ్యత్వాల నమోదు, బూత్ స్థాయి సంఘాలతో విరాజిల్లుతోందన్నారు. దేశవ్యాప్తంగా 6 కోట్ల మంది సభ్యత్వాలు నమోదు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి తదితరులు పాల్గొన్నారు.

మింగేస్తున్నారా.. చూస్తుంటారంతే!

● జిల్లాలో రూ.8.22 కోట్లు పక్కదారి ● రికవరీల ఊసే లేదు

చనిపోయినా పింఛన్లు..
మొక్కలు నాటారంటారు గానీ.. కనిపించవు..
పనికి రాకున్నా.. అనర్హులైనా.. వచ్చినట్టే.. మస్తర్లు
ఇలా ఒక్కటేమిటి..
ఉపాధి హామీ పథకం.. అవినీతి, అక్రమాల లీలలు ఎన్నో. ఎంత తిన్నా.. బయటకు రాదు.. వచ్చినా చర్యలు ఉండవు.. ఏకంగా క్షేత్ర స్థాయి సిబ్బంది రూ.కోట్లకు పడగలెత్తుతున్నారు. ఆ స్థాయిలో బొక్కేస్తున్నా మిన్నకుంటున్నారు.

న్యూస్‌టుడే, పార్వతీపురం

జిల్లాలోని 15 మండలాల్లో జరిగిన పనులపై పదిహేను విడతల్లో సామాజిక తనిఖీలు చేపట్టి రూ.కోట్లలో అక్రమాలు జరిగినట్లు గుర్తించారు. వాటిని రికవరీ చేసేందుకు నోటీసులు ఇద్దామన్నా బాధ్యులెవరో..? ఎంత వసూలు చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది.



కురుపాం: సామాజిక తనిఖీ కార్యక్రమంలో సిబ్బందిని నిలదీస్తున్న అధికారులు

కొన్నింటిని పరిశీలిస్తే..

◆ కురుపాం మండలం నీలకంఠాపురం పంచాయతీలో 39 మంది మృతి చెందినప్పటికీ కొన్ని నెలలుగా పింఛన్లు ఇస్తున్నట్లు గుర్తించారు. ఇక్కడ రూ.6.93 లక్షలు, మిగిలిన పంచాయతీల్లో 16 మంది మృతుల పేరున రూ.4.52 లక్షలు ఇచ్చారు.

◆ వీరఘట్టం మండలం దశమంతపురంలో సచివాలయ భవనానికి కిటికీలు, తలుపులు వేయడానికి ఖాతా నుంచి నిధులు తీసుకున్నారు. కానీ అమర్చలేదని తనిఖీల్లో బయటపడింది. తర్వాత ఈ పనులు పూర్తి చేశారు.

◆ అన్ని మండలాల్లో వేతనదారుల నుంచి క్షేత్ర సహాయకులు రూ.100 చొప్పున వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి.


◆ చాలా మంది గ్రామాలను వదిలి వెళ్లినప్పటికీ పనులకు వచ్చినట్లు మస్తర్లు వేసి డబ్బులు పక్కదారి పట్టించారు. భారీగా మొక్కలు నాటగా 50 శాతం కూడా బతకలేదు.

3865 ఫిర్యాదులు

ఉపాధి పనుల్లో అవినీతి జరుగుతోందని జిల్లాలోని అన్ని మండలాల నుంచి 3,865 ఫిర్యాదులు వచ్చాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఏకంగా రూ.8,22,18,166 పక్కదారి పట్టగా జిల్లా కేంద్రానిదే అగ్రభాగం కావడం విశేషం. బాధ్యుల నుంచి రావాల్సిన మొత్తాలను తిరిగి చెల్లించాలని ఇటీవల నోటీసులు జారీ చేశారు.

నోటీసులు ఇస్తున్నాం: సామాజిక తనిఖీల్లో గుర్తించిన తప్పిదాలపై సంబంధిత వ్యక్తులకు నోటీసులు ఇచ్చి వివరణ తీసుకుంటున్నాం. పనులు చేయకుండా చేసినట్లు నమోదు చేసుంటే పూర్తి చేయిస్తాం. జిల్లాలో రూ.8.22 కోట్లు రికవరీ చేయాల్సి ఉంది.

– కె.రామచంద్రరావు, పీడీ, జిల్లా జల యాజమాన్య సంస్థ



లక్ష్మీనృసింహునికి ముడుపులు

సీతానగరం, న్యూస్‌టుడే: సీతానగరం వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీనృసింహునికి గురువారం ముడుపుల పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో మూల విరాట్‌ను ప్రత్యేక పూల, తులసి మాలలతో అలంకరించారు. విడతల వారీగా ముడుపుల పూజలు చేశారు. పార్వతీపురం, బొబ్బిలి, పాలకొండ పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనృసింహుడు

చలో కలెక్టరేట్ గోడప్రతుల ఆవిష్కరణ

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలు పరిష్కరించాలనే చిత్తశుద్ధి అధికారులకు, ప్రభుత్వానికి ఉండాలని ఆర్టీసీ యూనియన్ రాష్ట్ర నాయకుడు తులసీరామ్ అన్నారు. కలెక్టరేట్ వద్ద పట్టణ తాగునీటి సమస్యపై రిలే దీక్షను సందర్శించారు. శిబిరంలోని ఐద్వా సంఘ నాయకులకు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చుట్టూ జీవనదులున్నా తాగునీటి కోసం పట్టణ ప్రజలు అల్లాడాల్సిన పరిస్థితి ఉందన్నారు. అక్టోబరు 1న చలో కలెక్టరేట్ గోడప్రతులను ఆవిష్కరించారు. ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, జి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.